క్లుప్తంగా

కాలుష్య నియంత్రణకు సహకరించండి



నగరంలో కాలుష్య నియంత్రణకు అందరూ సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకట కుమారి కోరారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజు వ్యక్తిగత వాహనాలు వీడి, ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. సోమవారం ఆమె పెదగదిలిలోని తన క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణానే ఉపయోగిస్తున్నారన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

- దాబాగార్డెన్స్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థి శ్యామ్‌ను సత్కరిస్తున్న ఆచార్య ప్రేమానందం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ విద్యార్థి శ్యామ్ యూజీసీ జేఆర్ఎఫ్ సాధించారు. దివ్యాంగుడైన శ్యామ్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రతిభ అర్హత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ జేఆర్ఎఫ్ సాధించడంపై విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం శ్యామ్‌ను విభాగంలో సత్కరించారు. తనకున్న వైకల్యాన్ని అధిగమించి ఉన్నతంగా ఎదగాలనే ఆకాంక్ష, పట్టుదలతో చదివి జేఆర్ఎఫ్ సాధించడాన్ని ప్రశంసించారు. విద్యార్థులు శ్యామ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. శ్యామ్ మాట్లాడుతూ తాను పరీక్షకు సన్నద్ధమైన విధానం, ఉపయక్తంగా నిలిచిన గ్రంథాలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించాడు. తనకు సహకరించి ప్రోత్సాహం అందించిన అధ్యాపకులు, ఆచార్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. విభాగ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి దోహదపడేలా పరిశోధనలు



ప్రణవికి డాక్టరేట్ అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

విశాఖ విద్య: సమాజాభివృద్ధికి దోహదపడేలా పరిశోధనలు సాగాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.ధనుంజయరావు అన్నారు. ఏయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని కర్రి చైతన్య ప్రణవికి సోమవారం ఆయన డాక్టరేట్ ప్రదానం చేశారు. 'మెకానికల్ క్యారెక్టరైజేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ అడిటివ్ మాన్యుఫ్యాక్చర్డ్ సాండ్విచ్ లాటిస్ స్ట్రక్చర్-ఏ కాంప్రహెన్సివ్ స్టడీ' అనే అంశంపై ప్రణవి పరిశోధనలు చేశారు. ఏయూ రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య కె.వెంకట సుబ్బయ్య పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు ఏయూ నుంచి డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా ప్రణవిని పలువురు అభినందించారు.

వసతి గృహంలో వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలు లక్ష్మిని వసతి గృహంలో అప్పగిస్తున్న యువకులు

సీతమ్మధార: ఈ వృద్ధురాలి పేరు తాటిపిల్లి లక్ష్మి (75). ఊరు తగరపువలస. ఆరిలోవ పోలీసులు పంపించారని చెప్పి.. ఇద్దరు యువకులు ఈమెను ద్వారకానగర్‌లోని ఏయూటీడీ-జీవీఎంసీ మహిళా షెల్టర్ హోమ్‌కు సోమవారం అప్పగించారు. వృద్ధురాలిని తన వివరాలు అడగ్గా.. కుటుంబ సభ్యులున్నారని చెప్పి, ఇతర ఏ విషయం స్పష్టంగా చెప్పలేక పోయారు. ఈమెకు వసతి గృహంలో తాత్కాలికంగా కొన్ని రోజులు ఆశ్రయం కల్పించినట్లు షెల్టర్ హోమ్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.



కళాకారుడి పేరు లేకుండా శిల్పం



బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్ వద్ద రాళ్ల కుప్పగా మారిన శిల్పాలు



దెబ్బతిన్న శిల్పం కింది భాగం

నిర్లక్ష్యానికి నిదర్శనం..
శిలల ఉద్యానవనం

- కాలగర్భంలో కలిసిపోతున్న విలువైన శిల్పాలు
- శిల్పులు, శిల్పం పేరుతో కూడిన బోర్డులు మాయం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- పూర్వవైభవం తేవాలని కోరుతున్న సందర్శకులు

కళావిహీనంగా బీచ్ రోడ్డులోని శిల్పాల పార్క్



ఏయూ స్థలంలో నిర్లక్ష్యంగా పడేసిన శిల్పాలు



శిల్పాన్ని కలిపి కట్టేసిన గోడ

ఏయూ క్యాంపస్ : గత పాలకులు ఎంతో ప్రత్యేకతతో తీర్చిదిద్దిన శిలల ఉద్యానవనం నేడు నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. బీచ్ రోడ్డు ఆధునికీకరణలో భాగంగా దేశంలోని విభిన్న ప్రాంతాల నుంచి శిల్పులు వచ్చి ఇక్కడ తమ ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన వైవిధ్యమైన శిల్పాలు నేడు పనికిరాని రాళ్ల కుప్పలుగా మారిపోయాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన శిల్పాలు నేడు కళావిహీనంగా మారాయి.

21 మంది శిల్పుల కష్టం

దేశ వ్యాప్తంగా విభిన్న రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి 21 మంది శిల్పులు విశాఖ నగరానికి వచ్చారు. 1998 డిసెంబర్ 26 నుంచి 1999 జనవరి 7 వరకు స్వయంగా సాగర తీరంలో ఈ శిల్పాలను చెక్కారు. వీటి రూపకల్పన క్యాంపేను నాటి జీవీఎంసీ అధికారులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ప్రఖ్యాతి గాంచిన శిల్పులు తయారు చేసిన ఈ శిల్పాలను బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్‌కు పక్కనే ఉన్న ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. దీనికి సంబంధించిన వివరాలతో కూడిన చిన్న శిలాఫలకం ఇప్పటికి సాక్ష్యంగా నిలచింది. 21 మంది శిల్పులు దాదాపు 13 రోజులు శ్రమించి తీర్చిదిద్దిన శిల్పాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఢిల్లీ, అహ్మదాబాద్, చెన్నయ్ వంటి ప్రాంతాల నుంచి వచ్చిన శిల్పులు నగరంలో ఉండి తయారు చేసిన ప్రత్యేకమైన శిల్పాలు ఇవి. వీటి ప్రాముఖ్యతను విస్మరిస్తూ నిరుపయోగంగా వీటిని మార్చేస్తున్నారు.

శిల్పాల స్థాన చలనం

బీచ్ రోడ్డులోని విశాలమైన ప్రాంతంలో ఈ శిల్పాలను ఏర్పాటు చేశారు. తరువాతి కాలంలో ఈ శిల్పాల పార్క్ వెనుక భాగంలో ప్రస్తుతం ఉన్న సీహారియర్ మ్యూజియం భవనం(గతంలో రాజీవ్ స్మృతి వనం) నిర్మించారు. ఈ ప్రక్రియలో భాగంలో కొన్ని శిల్పాలను తొలగించారు. వీటిని మరో ప్రాంతంలో స్థాపించాల్సిన అధికారులు గాలికొదిలేశారు. వీటి ప్రాముఖ్యత, విలువ తెలియని కార్మికులు వీటిని పక్కనే ఉన్న ఆంధ్రా యూనివర్సిటీ స్థలంలో పారవేశారు.

అధికారుల బాధ్యతారాహిత్యం

ప్రస్తుతం పార్క్‌లో ఉన్న కొద్దిపాటి శిల్పాలు కూడా కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. శిల్పాల కింది భాగంలో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు విరిగిపోతున్నాయి. కొన్ని శిల్పాలకు వాటిని తయారు చేసిన శిల్పుల పేర్లు, శిల్పానికి వారు పెట్టిన పేరు తెలిపే బోర్డులు సైతం లేవు. చరిత్రను చెరిపేసే విధంగా ఇంతటి నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు దీనికి బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ శిల్పాలు నిర్లక్ష్యంగా పక్కన పడేయడం అధికారుల నిర్లక్ష్యానికి దర్పణంగా నిలుస్తోంది. ఏయూ మైదానంలో నిర్లక్ష్యంగా పడేసిన శిల్పాలను గుర్తించి ప్రస్తుతం ఉన్న పార్క్‌లో వీటిని ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుంది. శిల్పాల ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని నగరవాసులు, సందర్శకులు కోరుతున్నారు.

కంటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఆరిలోవ: హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో సోమవారం కంటి క్యాన్సర్‌పై రోగులకు అవగాహన కల్పించారు. ఎల్వీపీ కంటి వైద్యురాలు లావణ్య మాట్లాడుతూ కంటి క్యాన్సర్-తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. క్యాన్సర్ వ్యాధి ఊపిరితిత్తులు, రొమ్ము, చర్మంతోపాటు కంటికి కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని త్వరగా గుర్తించలేకపోతే శాశ్వతంగా చూపు పోవడంతోపాటు ప్రాణాంతకంగా కూడా మారుతుందని హెచ్చరించారు. బాల్యంలోనే కంటి క్యాన్సర్ వచ్చినవారు మన దేశంలో ఎక్కువగా ఉన్నారని తెలిపారు. పిల్లల్లో కంటి క్యాన్సర్‌కు సంబంధించిన రెటినో బ్లాస్టోమా సమస్య కనిపిస్తోందన్నారు. పదేళ్లు దాటిన వయసు గల చిన్నారుల్లో ఆక్యులర్ సర్ఫేస్ స్క్వామస్ నియోప్లాసియా కంటి క్యాన్సర్ ప్రధాన సమస్యగా మారిందన్నారు. జన్యుపరంగా ఈ సమస్య రావడంతోపాటు రోగ నిరోధకశక్తి తగ్గడం వల్ల, పెద్దల్లో ధూమపానం వల్ల వస్తుందన్నారు. కంటి క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం కష్టమైన వ్యవహారమని, తరుచూ కంటి వైద్య పరీక్షలు చేయడం ద్వారా దీన్ని గమనించవచ్చని ఆమె సూచించారు. దీనిపై నిర్లక్ష్యం చేస్తే కంటి చూపుపోయే ప్రమాదం ఉంటుందన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు పాఠశాల ఆవరణలో సోమవారం ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథి డీఈవో ప్రేమ్‌కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంపై మానవీయత, ఉన్నత లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. విలువలతో కూడిన విద్యను అందిస్తున్న శ్రీసత్యసాయి విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవిస్తే చర్యలు



ఎంసీహెచ్ కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: మాతా, శిశు మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని, వాటి నివారణకు క్షేత్రస్థాయిలో గర్భిణులను గుర్తించి తగు సూచనలివ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో జనవరిలో సంభవించిన ఒక మాతృ మరణంపై సోమవారం ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతా, శిశు సంక్షేమ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్డిపల్లిలో ఒక మాతృ మరణం జనవరిలో జరిగిందని, ఇకపై అవి జరగకూడదని హెచ్చరించారు. గర్భిణిగా ఉన్నప్పుడే హై రిస్క్ ప్రెగ్నెన్సీని గుర్తించి తగిన వైద్య సలహాలు అందించాలని కేజీహెచ్, వీజీహెచ్‌లో గల గైనకాలజిస్టులకు సూచించారు. గర్భిణికి సాధారణ ప్రసవం అయ్యేటట్లు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ ఉషాప్రసాద్, గైనకాలజిస్ట్, సూపరింటెండెంట్, డాక్టర్ హెచ్‌ఆర్కే దొర, డాక్టర్ షర్మిలాకుమారి, గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీదేవి, బి.వర్షిక, జనరల్ మెడిసిన్ ఓపీ డాక్టర్ జి.వి.గణేష్, ఎనాస్తీసియాలజిస్ట్, నోడల్ అధికారి బి.నాగేశ్వరరావు, త్రినాధరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్, 108 సేవలు, ఐ.మనోరమ, డీపీహెచ్‌ఎన్‌వో డాక్టర్ కె.స్వప్న, రేవిడి ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, రెడ్డిపల్లి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు విద్యార్థులతో స్నేహితుడిలా మెలగాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఆరిలోవ: పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో స్నేహితుడిగా వ్యవహరించాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ సూచించారు. తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి, పరిశీలించారు. అనంతరం ఆర్జేడీ మాట్లాడుతూ తరగతిలో పిల్లలను ప్రశ్నలు అడిగేటట్లు ప్రేరేపించాలని, ప్రశ్నలు అడిగే వారిని ఆపేయకూడదన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఏదైనా కొత్త విషయం నేర్పించడానికి ప్రయత్నించాలని చెప్పారు. అంగన్‌వాడీ ఉద్యోగులు వేసే పునాదిని బట్టే పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. మంచి పిల్లలను విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి అంగన్‌వాడీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చంద్రశేఖరరావు, సీఎంవో దేముడుబాబు, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, డీఆర్‌పీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


కృష్ణా కళాశాలకు పుస్తకాల వితరణ



ప్రిన్సిపాల్ విజయబాబుకు పుస్తకాలు అందిస్తున్న ఫిజిక్స్ లెక్చరర్ రాజేశ్వరరావు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి ఫిజిక్స్ అధ్యాపకుడు ఎం.రాజేశ్వరరావు రూ.2,000 విలువైన పుస్తకాలను వితరణ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు చాంబర్‌లో ఈ పుస్తకాలను సోమవారం అందజేశారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జీవిత గాథలు, చారిత్రక గ్రంథాలను అందజేసినట్లు రాజేశ్వరరావు తెలిపారు. ఆయనను ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థుల ఉన్నతికి దోహదపడే పుస్తకాలను గ్రంథాలయానికి వితరణ చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. గ్రంథాలయాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్‌కు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.జయ, వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ డి.శ్రావణ్‌కుమార్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కె.రవిబాబు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్, డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, డాక్టర్ పి.గోపాలనాయుడు, డాక్టర్ ఎస్.శంకరరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై డీఐజీకి ఫిర్యాదు



డీఐజీ గోపీనాథ్ జట్టీకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ప్రజాశక్తి ప్రతినిధులు

విశాఖ సిటీ: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి పత్రిక విలేకరిగా పనిచేస్తున్న రామారావుపై ఈ నెల 16న దాడి చేసిన టీడీపీ మండల నాయకుడు గుల్ల వేణుగోపాలనాయుడుపై చర్యలు తీసుకోవాలని ప్రజాశక్తి ప్రతినిధులు సోమవారం డీఐజీ గోపీనాథ్ జట్టీని కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. విలేకరిపై దాడి చేయడమే కాకుండా చంపేస్తానని బెదిరించాడని, ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఐజీ స్పందిస్తూ స్థానిక సీఐతో మాట్లాడుతున్నానని, తాను కూడా ఫాలో అప్ చేస్తున్నట్లు చెప్పారు. డీఐజీని కలిసిన వారిలో ప్రజాశక్తి బ్యూరో ఇన్‌చార్జి మధుసూదనరావు, స్టాఫ్ రిపోర్టర్ జి.కాంతారావు, జిల్లా ఇన్‌చార్జి ఎస్.రాజేష్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్ రాజేష్ ఉన్నారు.

గోల్డ్ రింగ్ దొంగతనంపై కేసు నమోదు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఎస్ఆర్ఎస్ జ్యువెలరీ షాపులో బంగారు ఉంగరం దొంగతనంపై ఎంవీపీ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఇటీవల ఇద్దరు భార్యభర్తలు గోల్డ్ రింగ్ కావాలంటూ ఎస్ఆర్ఎస్ జ్యువెలరీకి వచ్చారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ వారికి పలు రకాల ఉంగరాలు చూపించాడు. సుమారు గంట పాటు ఉంగరాలను చూసిన వారు అవేవి నచ్చలేదని తిరిగి వెళ్లిపోయారు. తరువాత సిబ్బంది కౌంట్ చేసుకోగా ఒక ఉంగరం కనిపించలేదు. సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించగా.. ఇద్దరు దంపతులు ఈ ఉంగరాన్ని దొంగిలించినట్లు తెలిసింది. దీంతో జ్యువెలరీ షాపు సీనియర్ క్యాషియర్ గోవిందు కిరణ్‌కుమార్ ఈ నెల 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌డీపీపీ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం-హిందూ ధర్మ ప్రచార పరిషత్(టీటీడీ - హెచ్‌డీపీపీ) విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో శివారాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. మనగుడి పేరిట హెచ్‌డీపీపీ ఆధ్వర్యంలో చేపట్టే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శివరాత్రి మహోత్సవం జరగనుందని సంస్థ సూపరింటెండెంట్ ఎం.క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ అర్బన్ మండలం మూలపాలెంలోని శ్రీవైశాఖేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జాలరిపేటలో దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుంచి 24 వరకు ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల గుర్తింపు సర్వే చేపట్టినట్లు సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. పెదజాలరిపేటతోపాటు చినవాల్తేర్‌లో సోమవారం ఈ సర్వే జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ స్థానిక సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పోలీస్ విధులు



అదనపు ఎస్పీ దేవప్రసాద్‌కు సెల్యూట్ చేస్తున్న పోలీస్ జాగిలం

ఆరిలోవ: పోలీస్ విధులు ఎంత కష్టమైనప్పటికీ సమర్థవంతగా నిర్వర్తించాలని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ పోలీస్ క్రీడా మైదానంలో రెండు వారాలుగా నిర్వహించిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ వార్షిక డీమొబలైజేషన్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయనకు సిబ్బంది గౌరవ వందనం చేశారు. పోలీస్ జాగిలం ఆయనకు సెల్యూట్ చేసి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ డీమొబలైజేషన్‌ను ఎవ్వరూ భారంగా భావించకూడదన్నారు. సిబ్బందిపై గురుతర బాధ్యత ఉందని, వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబంపై పూర్తి బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని కోరారు. రెండు వారాల ప్రత్యేక కార్యక్రమంలో పరేడ్, వీవీపీ సెక్యూరిటీ నిర్వహణ, రక్షణ, ఆయుధాల వినియోగం, ఫైరింగ్ ప్రాక్టీస్, బందోబస్తు నిర్వహణ, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అత్యవసర పరిస్థితుల్లో మాబ్ కంట్రోల్ తదితర నైపుణ్యాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పునఃసమీక్షించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు మన్మధరావు, రామకృష్ణారావు, అరవింద్ కిశోర్, రమణమూర్తి, సంజీవిరావు, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా నాగరాజు



ఎంవీపీకాలనీ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 17వ వార్డు పెదవాల్తేరుకు చెందిన ఆగురు నాగరాజు నియమితుడయ్యారు. ఈ మేరకు సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాగరాజు బీజేపీ నాయకుడిగా, ఆర్ఎస్ఎస్ సభ్యుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. బీసీల అభ్యున్నతికి సేవలందించాలని సూచిస్తూ కృష్ణయ్య నాగరాజును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా బీసీ నాయకులు పేర్కొన్నారు. బీసీ నాయకులు శ్యాంసుందర్‌నాయుడు, పితాని ప్రసాద్, వెంకటనాయుడు తదితరులు నాగరాజుకు అభినందనలు తెలిపారు.

బీఆర్‌టీఎస్ రహదారిలో అంధకారం



బీఆర్‌టీఎస్ రోడ్డుపై దీన్‌దయాల్‌పురం కూడలిలో వెలగని విద్యుత్ లైట్లు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రహదారిలో అంధకారం నెలకొంది. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్‌పై ఎక్కువ చోట్ల విద్యుత్ దీపాలు కొద్ది రోజులుగా వెలగడం లేదు. ఇక్కడ వాహనాలు వెలుగులే ఆధారమవుతున్నాయి. దీంతో కూడళ్ల వద్ద రాత్రిళ్లు చీకటిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కూడళ్ల వద్ద ఎదురెదురుగా రోడ్డు దాటుతున్న వాహన చోదకులు ఢీకొంటున్నారు. ఆదివారం రాత్రి దీన్‌దయాల్‌పురం కూడలిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఆయా వాహన చోదకులు గాయాలపాలయ్యారు. బీఆర్‌టీఎస్ రోడ్డుపై విమ్స్ కూడలి, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ కూడళ్లలో చీకటిలో రోజూ ఇదే పరిస్థితి. ఈ జంక్షన్లతోపాటు ఐదు లైన్లలో పలుచోట్ల లైట్లు వెలగడం లేదు. జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించి ఈ రోడ్డుపై విద్యుత్ దీపాలు వెలిగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

27న ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం

ఎంవీపీకాలనీ: ఈ నెల 27న ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఎన్‌జీవో ఫోరమ్ ప్రతినిధి విశాలాక్షి తెలిపారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, నరవ ప్రకాశరావుతో కలిసి సోమవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 27న ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం నిర్వహిస్తామని, జిల్లాలోని ఎన్జీవోలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు.

సమర్థుడిని ఎమ్మెల్సీగా ఎన్నుకోండి

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమర్థుడైన, అత్యంత విలక్షణమైన నేపథ్యం గల వ్యక్తిని ఎన్నుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మూల వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్రంలో విద్యా రంగ పరిరక్షణ, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడగలిగే వ్యక్తిని గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వంతో పోరాడే వ్యక్తి మండలిలో తమకు ఉండాలన్న భావనతో ఉపాధ్యాయులు ఓటు వేయాలన్నారు.

రోడ్డుపై చేపల దుకాణంతో దుర్గంధం



20వ వార్డులో రోడ్డు మీద నిర్వహిస్తున్న చేపల దుకాణం

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని రామలక్ష్మి అపార్ట్‌మెంట్స్ జంక్షన్ నుంచి విశాఖ ఐ ఆస్పత్రికి వెళ్లే మార్గం దుర్గంధ భరితంగా మారింది. ఏయూ ఉద్యోగుల క్వార్టర్స్‌కు ఆనుకొని ఉన్న ఈ రహదారిలో చేపల దుకాణం పెట్టి విక్రయించడంతో వాహన చోదకులు, స్థానికులు, పాదచారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారిలో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చేపల దుకాణాన్ని అక్కడి నుంచి తరలించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.